ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 18 సెప్టెంబరు 2025

టమోటా ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలి: ఏపీ రైతు సంఘం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో టమోటా ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కక్కలపల్లి టమోటా మార్కెట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో టమోటాను అధికంగా సాగు చేస్తున్నారని, గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోతున్నారని అన్నారు. మార్కెట్‌లో దళారులు రింగ్‌గా ఏర్పడి, రైతులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. అందుకే ప్రభుత్వం టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు రామకృష్ణ, శ్రీకాంత్, నరేష్, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలి

● విద్యార్థులకు కలెక్టర్ సూచన ● టేకులోడు పాఠశాల తనిఖీ

చిలమత్తూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలవైపు అడుగులు వేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని టేకులోడు మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ప్రతి తరగతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి బోధన, పాఠశాలలో సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం ప్రిన్సిపాల్ శోభారాణితో వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానంగా వంట గది, పిల్లలు ఉపయోగించే బాత్‌రూంలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాల స్వచ్ఛాంధ్ర పురస్కారానికి నామినేట్ అయిందనీ, దీనిని దృష్టిలో పెట్టుకుని, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచే విషయంలో రాజీ పడవద్దని కలెక్టర్ ఆదేశించారు.

సత్యసాయి బాటే.. పరమావధి

సేవాదళ్ జాతీయ అధ్యక్షుడు నరసింగారావు

అలరించిన మధుర స్మరణం




పాటలు పాడుతున్న భక్తులు, ప్రసంగిస్తున్న నరసింగారావు

పుట్టపర్తి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా సేవా బాటే తమకు పరమావధి అని సేవాదళ్ జాతీయ అధ్యక్షుడు నరసింగారావు పేర్కొన్నారు. పర్తియాత్రగా ప్రశాంతి నిలయానికి చేరుకున్న మలేషియా భక్తులు సాయికుల్వంత్ సభామండపంలో బుధవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నరసింగారావు మాట్లాడుతూ.. సత్యసాయి ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలు కోట్లాది మంది భక్తులకు శాంతిజీవనంగా మారాయన్నారు. సత్యసాయి చూపిన సేవాబాటలో సామాజిక సేవలు చేపడుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మధుర స్మరణం పేరిట సంగీత కచేరి నిర్వహించారు. వాయిద్య గానంతో భక్తులను అలరింపజేశారు.

డీజీపీని కలిసిన ఎస్పీ సతీష్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీష్ గుప్తాను కొత్త ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ మంగళగిరిలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం చంద్రబాబు ఏపీ సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు ఆయన రాజధానికి వెళ్లిన విషయం తెలిసిందే. అనంతరం ఎస్పీల సదస్సులో పాల్గొన్నారు. డీజీపీని ఆయన కార్యాలయంలో కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ సతీష్ కుమార్



వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

● మాజీ ఎమ్మెల్సీ గేయానంద్


వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గేయానంద్, ప్రజాసంఘాల నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులతో కలిసి బుధవారం ఆయన పెనుకొండలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కళాశాల నిర్మాణం ప్రారంభించి దాదాపు రూ.30కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. ఇంత ఖర్చుపెట్టి ప్రైవేట్‌వారిని ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏముందని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం రూ.300కోట్లు మంజూరు చేసి వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను విరమించుకోని పక్షంలో ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంగాధర్, వెంకటరాముడు, సీఐటీయు నాయకులు నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చిరంజీవి, భవన నిర్మాణ కార్మికులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కట్టకిందపల్లిలో చోరీ

బత్తలపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలపరిదిలోని కట్టకిందపల్లిలో చోరీ జరిగినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన రాజేష్‌నాయుడు కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి రాగానే... గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టినట్లు గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా బద్దలు కొట్టి అందులోని మూడు తులాల బంగారం, రూ. 30వేలు నగదు దొంగిలించనట్లు గుర్తించారు. అతడు ఫిర్యాదు చేయగా... పోలీసులు గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంతో వేలు ముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

ముదిగుబ్బలో...

ముదిగుబ్బ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయినగర్‌లో చోరీ జరిగినట్లు ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపారు. స్థానిక సాయినగర్ కాలనీకి చెందిన జాకీర్ హుస్సేన్ కుటుంబం ఇంటికి తాళం వేసి ఐదు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లింది. తిరిగి బుధవారం వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బీరువాలోని సుమారు ఎనిమిది తులాల బంగారం నగలు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుంతలతో దివ్యాంగుల ఉపాధికి ఆటంకం

కదిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వాహనాలు నిలపకుండా రెవెన్యూ అధికారులు తీసిన గుంతలతో దివ్యాంగుల ఉపాధికి ఆటకం ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలువురు దివ్యాంగులు అర్జీలను పూర్తిచేసి, లబ్దిదారులకు అందిస్తుంటారు. దానితో వచ్చే ఆదాయం వచ్చేది. గుంతలు తీయడం వల్ల దివ్యాంగులు కూర్చోవడానికి అవకాశం లేకుండాపోయింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దివ్యాంగుల సంఘం నాయకులు వెంకట రమణ, సూర్యనారాయణాచారి బుధవారం తెలిపారు. ఆ గుంతలను పూడ్చి తమ ఉపాధికి ఇబ్బంది లేకుండా చూడాలని వారు కోరారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట తీసిన గుంత



సమతుల ఆహారం గురించి వివరిస్తున్న అధికారులు

పోషణ మాసోత్సవాలు ప్రారంభం

తనకల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి గ్రామంలో బుధవారం ఎనిమిదో జాతీయ పోషణ మాసోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఎంపీపీ కౌసల్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ రామానాయక్, వైద్యాధికారి డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవమ్మ, పాల్గొని, కార్యక్రమ ఉద్దేశం వివరించారు. స్వస్థ్ నారీ.. స్వశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జబీన్‌తాజ్, భాగ్యలక్ష్మీ, వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి, శోభన, గంగరత్న, పద్మా, లీలా, కమల, శ్రావణి, శశికళ, సిబ్బంది, సచివాలయం, వైద్య ఆరోగ్య ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలను మెరుగుపరచాలి: ఆర్జేడీ



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సురేశ్‌బాబు

ధర్మవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది కన్నా ఈ ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణత ఫలితాలు మెరుగుపడేలా కృషి చేయాలని కడప ఆర్జేడీ సురేశ్‌బాబు.. అధ్యాపకులకు సూచించారు. ఆయన బుధవారం స్థానిక ప్రభుత్వబాలికల జూనియర్ కళాశాలను డీఐఈఓ చెన్నకేశవులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల రికార్డులను పరిశీలించారు. ఆధునిక విద్యా విలువలు పెంపొందిస్తూ విద్యార్థినులకు అవగాహన కలిగేలా బోధన ఉండాలని సూచించారు. యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలను నిర్మూలిద్దాం'

కదిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను నిర్మూలిద్దామని జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది నాగలక్ష్మి, కస్తూర్బా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కల్పన పేర్కొన్నారు. తలుపుల మండలకేంద్రంలోని కేజీబీవీలో బుధవారం బాల్యవివాహాలు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. బాల్యంలోనే వివాహాలు చేసుకుంటే శారీరకంగా, మానసికంగా ఎదురయ్యే ఇబ్బందులు వివరించారు. పాఠశాలలో విద్యార్థినులతో సఖీ గ్రూపులు ఏర్పాటు చేశారు. బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ గౌతమి, ప్రసన్నలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

గాండ్లపెంట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహా రంపై మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.


జేవీవీ విద్యా కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా మహేంద్రరెడ్డి



ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) విద్యాకమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ఓబుళదే వరచెరువు జిల్లాపరి షత్ ఉన్నత పాఠశాలలో భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ఎన్ మహేంద్ర రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో విజయ నగరంలో జరిగిన జేవీవీ రాష్ట్ర మహాసభల్లో తనను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. తనను ఎంపిక చేసిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఎంపిక పట్ల పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు.

దళిత రణభేరిని విజయవంతం చేయండి

కదిరి అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 24న విజయవాడ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన దళిత రణభేరిని విజయవంతం చేయాలని బహుజన సమాజ్‌పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా పోస్టర్లను విడుదల చేశారు.



వందే సేవాతరం..!

వేర్వేరు వ్యక్తులు.. విభిన్న వృత్తులు.. అందరి తత్వం ఒక్కటే.. అదే మానవత్వం. ఆపదలో ఉన్నవారికి, నిరుపేదలకు సేవ చేయాలని తపిస్తారు. కష్టకాలంలో అండగా నిలుస్తారు. చేతనైన సాయం చేస్తారు. ప్రాణంపోతే భుజాలు ఇస్తారు. అలాంటి వారంతా ఒక్కచోట చేరారు. జట్టు ఏర్పాటైంది. సేవాతరంగా ఆవిర్భవించింది. అదే వందేమాతరం టీం.

● ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం ● అండగా నిలుస్తున్న వందేమాతరం టీం ● జట్టుగా ఏర్పడి కార్యక్రమాలు

తనకల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్‌కు చెందిన కోటపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బాగేపల్లి చలపతి, కోటపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ ఆలోచనతో వందేమాతరం టీం ఏర్పాటైంది. నేడు 20 మంది సభ్యులతో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు నుంచి కదిరి వరకు జాతీయ రహదారిపై ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా.. మొదటగా ఫోన్ వెళ్లేది వందేమాతరం టీంకు. సొంత అంబులెన్స్‌లో శరవేగంగా వచ్చి.. ప్రాణాపాయంలో ఉన్న ధైర్య సాహసాలతో రక్షించి, గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రులకు తరలించి, ప్రాణాలు కాపాడుతున్నారు వందేమాతరం టీం సభ్యులు. కరోనాతో చనిపోయిన వారిని కుటుంబ సభ్యులే పట్టించుకోకపోయినా.. వీరే ఖననం చేశారు. నిరుపేదలకు సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. టీంలోని 20 మంది సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ.. అందరి మన్ననలు పొందుతున్నారు.



కరోనా మృతుడిని అంత్యక్రియలకు తరలిస్తున్న వందేమాతరం టీం (ఫైల్)

జట్టు కట్టి..

మండలానికి చెందిన 20 మంది కరోనా సమయంలో ఎందరికో సాయం చేశారు. దీనిని గుర్తించిన ఉపాధ్యాయుడు వెంకటరమణ, బాగేపల్లి చలపతి.. వారందరినీ ఏకం చేశారు. ఒక్కొక్కరుగా కాకుండా అందరూ కలిసి సేవా కార్యక్రమాలు చేద్దామని నిర్ణయించుకున్నారు. అలా వందేమాతరం టీం ఆవిర్భవించింది. ఇందులో రూ.వంద సంపాదించే దినసరి కూలీ నుంచి అవసరమైతే ఒకేసారి రూ.లక్ష సాయం చేయగలిగే వారు ఉన్నారు. వీరిలో కొంతమంది వ్యాపారులు ఉన్నారు. మరికొందరు బెంగళూరులో స్థిరపడ్డారు. వీరందరూ కలిసి కరోనా కష్టకాలంలో ఎందరికో కూరగాయాలు, మాస్కులు, శానిటైజర్లు, అవసరమున్న వారికి మందులు, నిత్యావసర సరుకులు కూడా అందించారు. వీటన్నింటికీ మించి కరోనా సమయంలో మృతిచెందిన ఎందరికో దహన సంస్కారాలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు వీరు సొంత వాహనాల్లో ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చేవారు. ఇలా ఆస్పత్రులకు తరలించే క్రమంలో పలువురు క్షతగాత్రులు దారిలోనే ప్రాణాలు కోల్పోయారు. వాటిని చూసి చలించిపోయిన టీం సభ్యులు రూ.8లక్షలకుపైగా వెచ్చించి, ఓ అంబులెన్స్ వాహనాన్ని కొనుగోలు చేశారు. మండలంలో ఎక్కడ, ఏ ప్రమాదం జరిగినా, మొదటి ఫోన్‌కాల్ వచ్చేది వందేమాతరం టీంకే. మూడేళ్లుగా ఎందరో రోడ్డు ప్రమాద బాధితులను (గోల్డెన్ అవర్‌లో) ఆస్పత్రికి చేర్చి, ప్రాణాలు కాపాడారు. ఎవరు అందుబాటులో ఉంటే వారే స్వయంగా అంబులెన్స్‌ను తీసుకెళ్తారు. అవసరమనుకుంటే అందరూ కలిసి వెళ్లి, ప్రమాద బాధితులకు సాయం అందిస్తారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వందేమాతరం టీం (ఫైల్)

మండలంలో చాలామంది రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక, పాడి పరిశ్రమపై ఆధార పడ్డారు. పాడి ఆవులకు జ్వరం వచ్చి, కిందపడిపోతే వాటిని పైకి లేపడం కష్టంతో కూడుకున్న పని. ఈవిషయాన్ని గందోడివారిపల్లిలో పనిచేస్తున్న పశువైద్యాధికారి హరినాథ్ రెడ్డి.. వందేమాతరం టీం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో టీం రూ.65 వేలు విలువ చేసే, కౌ లిఫ్టర్ కొనుగోలు చేసి, రైతులకు అందుబాటులో ఉంచింది. గత రెండేళ్లలో ఎన్నో పశువులకు కౌ లిఫ్టర్ ద్వారా వందేమాతరం టీం సభ్యులు సహకారం అందించారు. మండలంలో మృతదేహాలను ఉంచడానికి ఫ్రీజర్ బాక్స్‌లు కొనుగోలు చేసి, అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మూడేళ్లుగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. నల్లగుట్లపల్లి, కోటపల్లి, కేజీబీవీ, గిరిజన బాలికల గురుకుల పాఠశాల తదితర పాఠశాలకు కంప్యూటర్లను ఉచితంగా అందించారు. ఎందరో ఆర్థిక సమస్యలతో మధ్యలో చదువులు ఆపేసేవారికి తమవంతు సహకారం అందిస్తున్నారు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి ఆర్థికసాయం చేస్తున్నారు. ఏటా వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎవరికి, ఏ అవసరం వచ్చినా వందేమాతరం టీమ్ సహకారం అందిస్తోంది. ఇటీవల చెక్కరివారిపల్లి అటవీ ప్రాంతంలో అంతర్రాష్ట్ర దొంగల ముఠాను వల పన్ని పట్టుకోవడంతో ఈ టీమ్ సభ్యులు ప్రదర్శించిన తెగువ ప్రశంసనీయం. కదిరి రూరల్, కర్నూలు జిల్లా పాణ్యం పోలీసులు అభినందించారు. వందేమాతరం టీం సభ్యులు మాట్లాడుతూ.. ప్రస్తుతం టీంలో చేరడానికి ఎందరో ముందుకొస్తున్నారన్నారు. వారికి ఆరునెలల గడువు విధించి సేవా కార్యక్రమాలు చేయాలని చెబుతామన్నారు. ఆరునెలలు తాము చేస్తున్న కార్యకలాపాల్లో భాగస్వాములైతేనే టీమ్‌లో చేర్చుకునే విషయం సభ్యులతో చర్చిస్తామన్నారు. అందరి అంగీకారం మేరకే అవకాశం కల్పిస్తామని చెబుతున్నారు. ఈ లెక్కన వందేమాతరం టీం సేవా కార్యక్రమాలు ప్రజలపై ఎంతలా ప్రభావం చూపుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

రౌడీషీటర్ ఆత్మహత్యాయత్నం



గోరంట్లలో పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు యత్నించిన నరేష్

గోరంట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారన్న మన స్తాపంతో పట్టణానికి చెందిన రౌడీ షీటర్ నరేష్ పోలీస్ స్టేషన్ ఎదురుగానే ఆత్మహత్యకు యత్నించాడు. గోరంట్లకు చెందిన నరేష్, మహేష్ సోదరులు. గతంలో టీడీపీలో పనిచేశారు. 2014లో వారిపై పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. కొత్త ఎస్పీ రావడంతో సీఐ శేఖర్ ఇరువురిని స్టేషన్‌కు పిలిపించి బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనవసరంగా తమను హింసించారంటూ స్టేషన్ ఎదురుగానే నరేష్ శరీరంపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అడ్డుకున్నారు. మండల వ్యాప్తంగా 20మంది రౌడీ షీటర్లు ఉన్నారని సీఐ శేఖర్ తెలిపారు. వీరిలో నరేష్, మహేష్ ఏడాది నుంచి స్టేషన్‌కు రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొత్త ఎస్పీ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం రౌడీ షీటర్లందరినీ స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామని అన్నారు. నరేష్‌పై హత్య, ఇసుక దందా కేసులు ఉన్నాయని, ఇటీవల గోరంట్లలో ఆర్అండ్‌బీకి చెందిన ప్రహరీ తొలగింపుపై రెండు కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీరు దౌర్జన్యానికి పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని తెలిపారు. ఆత్మహత్యాయత్నం కేసు, పోలీసులపై దౌర్జన్యం చేయడంతో మరో కేసు నమోదు చేశామని తెలిపారు.

11 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. అత్యధికంగా నార్పలలో 6.2 సెంటీమీటర్లు, యల్లనూరు 1.8, కూడేరు 1.7, గార్లదిన్నె 1.4, బుక్కరాయసముద్రం 1.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 0.9 సెంటీ మీటర్లలోపు వర్షపాతం నమోదైంది.

బాధ్యతలు చేపట్టిన డీఎఫ్ఓ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖ అధికారిగా చక్రపాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. డీఎఫ్ఓ విఘ్నేష్ అప్పావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్ఓ చక్రపాణికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు జిల్లా అటవీశాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడి అదృశ్యం



ఇర్ఫాన్

పరిగి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సీతారాంపురం కాలనీకి చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు ఆదివారం నుంచి కనిపించడంలేదని తల్లి ముంతాజ్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రంగడు తెలిపిన మేరకు ఇర్ఫాన్ హిందూపురంలో టెంపో డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. గత మూడు రోజుల నుంచి ఇంటికి రాకపోవడంతో టెంపో యాజమాన్యంతో తల్లి ముంతాజ్ విచారించారు. దీంతో వారు ఇర్ఫాన్ తమ వద్దకు రాలేదని చెప్పడంతో కిడ్నాప్ చేసి ఉంటారనే అనుమానంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. యువకుడిని గుర్తిస్తే 9440908879కు సమాచారం అందించాలన్నారు.

డెంగీతో చిన్నారి మృతి

గుత్తి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని కర్నూలు రోడ్డులో డెంగీతో చిన్నారి హర్షిత్(2) బుధవారం మృతిచెందాడు. గుత్తి ఆర్ఎస్‌లో నివాసముంటున్న వెంకటరమణ, మౌనిక దంపతుల కుమారుడు హర్షిత్‌కు వారం రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తరలించగా డెంగీ అని నిర్ధారించారు.

పొలంలో కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న అటవీ శాఖ అధికారి

కదిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం గజ్జలప్పగారిపల్లి సమీపాన వేరుశనగ పొలంలో బుధవారం కొండచిలువ కనిపించింది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గజ్జలప్పగారిపల్లిలో వేరుశనగ పంటను తొలగిస్తుండగా కొండచిలువ కనిపించింది. భయపడిన కూలీలు వెంటనే అటవీ అధికారి నరసింహమూర్తికి విషయం తెలిపారు. వెంటనే ఆయన పొలం వద్దకు వచ్చి కొండ చిలువను పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలారు. ఆయన మాట్లాడుతూ.. కొండ చిలువతో ప్రాణహాని ఉండదనీ, ఇది రైతు నేస్తమన్నారు. జాగ్రత్తగా ఉండాలనీ, చంపకూడదని సూచించారు. పొలాల్లో కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచపు తొలి వాస్తుశిల్పి, సృష్టికర్తగా పేరొందిన విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలతో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు విశ్వ కర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఏఆర్ డీఎస్పీ మాట్లాడుతూ విశ్వకర్మ వాస్తుశిల్పి మాత్రమే కాదని కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కార్యాలయం ఏఓ సుజాత, సూపరింటెంట్ సరస్వతి, ఆర్ఐలు వలి, మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంటనే సమస్యలను పరిష్కరించండి : ఆర్డీఓ

ముదిగుబ్బ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి సమస్యలను జాప్యం చేయకుండా పరిష్కరించాలని ఆర్డీఓ మహేష్ అధికారులకు సూచించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని ఏబీపల్లి తండా, తప్పెటవారిపల్లిల్లో పర్యటించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన పలు ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదులపై నిర్ణీత కాల వ్యవధిలో పరిశీలించి, ఎటువంటి ఆలస్యం లేకుండా చట్ట ప్రకారం పరిష్కరించాలని తహసీల్దార్ నారాయణస్వామిని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలు అధికారులకు సహకరించి సమస్య పరిష్కారానికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



రాళ్లపల్లి షరీఫ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):నూర్‌బాషా కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన రాళ్లపల్లి షరీఫ్‌ను టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని గూడ్‌షెడ్ కొట్టాలలోని ఆయన నివాసంలో టీడీపీ నాయకులు బొట్టు కిష్ట, జింకలరాజన్న, చిన్నవీరప్ప, నాగలూరు లింగప్పపూజా మొబైల్‌సాయి శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు.

చౌడేశ్వరి ఆలయానికి సంధా రాఘవ విరాళం



విరాళం అందజేస్తున్న సంధా రాఘవ

ధర్మవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన అభీష్ట చౌడేశ్వరీ ఆలయ అభివృద్ధికి చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధా రాఘవ రూ.50వేల విరాళాన్ని అందజేశారు. ఆలయకమిటీ సభ్యులు, శాంతినగర్ వాసుల కోరిక మేరకు ఆయన, సోదరుడు సంధా రవీంద్రతో కలిసి రూ.50వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు గూడూరు గోపి, చింత పెద్దమునిస్వామి, పోలా లక్ష్మీరంగయ్య, మాధవన ఓబుళేశు, గోపాల్, చింతా భాస్కర్, జిలకర కిష్ట, దాసరి నాగేంద్ర, మద్దన మోహన్, టీడీపీ 3వ వార్డు ఇన్‌చార్జ్ మేకల లోకేశ్ పాల్గొన్నారు.

కంది పంట కళకళ



వసంతపురం వద్ద కళకళలాడుతున్న కందిపంట

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ఖరీఫ్‌లో ముందస్తుగా సాగుచేసిన కంది పంట కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పంట ఏపుగా పెరిగింది. మండలంలో ఈ ఏడాది వేరుశనగ కన్నా కందిపంట అత్యధికంగా సాగు చేసినట్లు వ్యవసాయాధి కారులు తెలుపుతున్నారు. వర్షాలకు కంది పంట ఏపుగా పెరుగుతుండటంతో సకాలంలో మందులు పిచికారి చేసి పూత, పిందెను కాపాడుకుంటే దిగుబడి బాగా వస్తుందని చెబుతున్నారు. వారం క్రితం కురిసిన వర్షాల వల్ల కందిపంట బాగా ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

'స్వస్థ నారీ సశక్త్ పరివార్' ప్రారంభం



కలెక్టరేట్‌లో పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ప్రారంభించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సం యుక్త భాగస్వామ్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమ పోస్టర్లను జేసీ అభిషేక్ కుమార్, రాష్ట్ర నోడల్ ఆఫీసర్, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ వీఎస్ మంజువాణి, ఆర్డీఓ సువర్ణ, వైద్యాధి కారులు డాక్టర్ సునీల్ విడుదల చేశారు. అనంతర స్థానిక ప్రాథమి క ఆరోగ్యకేంద్రంలో స్త్రీసంబంధిత వైద్యసేవల కార్యక్రమం, అభా కార్డులు, పీఎంజేఏవై కార్డుల నమోదు నిర్వహించారు. 'ఒక తల్లి - ఒక చెట్టు' కార్య క్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.

● ధర్మవరంరూరల్: మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్‌బాబు మాట్లాడారు. అనంతరం దర్శినమల పీహెచ్‌సీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని వర్చువల్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ పుష్పలత, వైద్యసిబ్బంది, బీజేపీ మండల కన్వీనర్ గొట్లూరు చంద్ర, అంగజాల రాజు తదితరులు పాల్గొన్నారు.

● బుక్కపట్నం/ కదిరి అర్బన్/ ముదిగుబ్బ: మహిళల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రవేశపెట్టిందని వైద్యాధికారి సురేశ్‌కుమార్, రాష్ట్ర లైవ్‌స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్ సాకే యశోదరాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంపై బుధవారం మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తెలుగు మహిళ అధ్యక్షురాలు లావణ్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కదిరి మండలంలోని పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. వైద్యాధికారి వినోద్‌కుమార్, సీహెచ్‌ఓ లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు. ముదిగుబ్బలో స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారులు రాజేంద్ర, శ్వేతా ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



పుట్టపర్తి హనుమాన్ కూడలిలో కేక్‌కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ భారతావనిని ప్రపంచదేశాల సరసన నిలబెట్టిన గొప్ప నాయకుడని బీజేపీ నాయకులు కళ్యాణ్, జ్యోతి ప్రసాద్ పేర్కొన్నారు. వారు బుధవారం జిల్లా కేంద్రంలోని హనుమాన్‌కూడలిలో వెలసిన హనుమాన్ దేవాలయంలో ప్రధాని నరేంద్రమోదీ పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధుల కు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండమరాజు, నాగార్జునశెట్టి, సురేంద్రబాబు, ధనుంజయరెడ్డి నారాయణ, కుసుమ జయరాం, రామాంజినేయులు, బాలగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మండల పరిధిలోని మలకవేముల పంచాయతీ ఎనుములవారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ నాయకులు బుధవారం కేక్ కట్‌చేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. పాఠశాలలోని 300 మంది విద్యార్థులకి నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం మలకవేముల క్రాస్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పాలు, బ్రెడ్డు పంచి పెట్టారు.

● నల్లచెరువు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బాణసంచా పేల్చారు. రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్‌అహమ్మద్, నాయకుడు మూడే గణేష్‌నాయక్; ఎస్ రమణ, శంకర్, ఇబ్రహీమ్, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: మండలంలోని మేకలచెరువు దళితవాడలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ చిన్నారులకు బుధవారం బీజేపీ నాయకులు నిత్యవసర సరుకులు, కూరగాయాలు పంపిణీ చేశారు. బీజేపీ నాయకుడు జయరాం, ఎమ్మార్పీఎస్ నాయకులు రెడ్డెప్ప, కదిరప్ప, రమణ; భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఓట్ చోర్ గద్దె చోడ్'ను విజయవంతం చేయండి

ధర్మవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి నాయకత్వంలో శుక్రవారం ధర్మవరంలో తలపెట్టిన 'ఓట్ చోర్ గద్దె చోడ్' కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు తుంపర్తి పరమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా అక్రమ ఓటర్ జాబితా, అక్రమ మార్పులు, చేర్పులు ఏ విధంగా జరుగుతున్నాయి? అనే విషయంపై వివరిస్తామన్నారు. అక్టోబరు 15వతేదీ వరకు ధర్మవరంలో ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

● ఎస్ఎఫ్ఐ నాయకులు



దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం మహిళా డిగ్రీ కళాశాలగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిపై యూనివర్శిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామాల నాగార్జున మండిపడ్డారు. యూనివర్శిటీ అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ బుధవారం దున్నపోతుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కే యూనివర్శిటీ పరిధిలో కేవలం డిగ్రీ కళాశాల అనే అనుమతులు ఉన్నాయని, అయితే మహిళా డిగ్రీ కళాశాలగా తప్పుడు ప్రచారం చేస్తూ అయితే మహిళ విద్యార్థినులకు మాత్రమే అడ్మిషన్లు ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా యూనివర్శిటీ అధికారులు స్పందించకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు అమన్, నాయకులు శ్రీనాథ్, అఖిల్, యూనస్, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ




కసముద్రంలో యూరియా కోసం వేచి ఉన్న రైతులు

అమడగూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): యూరియా వస్తోందని తెలుసుకున్న మండలపరిధిలోని కసముద్రం గ్రామ రైతులు బుధవారం స్థానిక సచివాలయం వద్ద ముందు గానే వేచివుండి తీసుకెళ్లారు. అయితే అవసరమైన రైతులు వేచి ఉన్నా అర్థముందని, అవసరం లేని వారు ఎక్కువగా వస్తున్నారని ఏఓ వెంకటరమణాచారి అన్నారు. దీంతో నిజమైన రైతులకు యూరియాతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా యూరి యా అవసరమైన రైతులు మాత్రమే తీసుకోవాలని సూచించారు. కసముద్రం సచివాలయానికి 280 బస్తాలు వస్తే, ఒక గంట వ్యవధిలో ఖాళీ అయిందని ఆయన పేర్కొన్నారు.

● గాండ్లపెంట: మండలంలోని కురమామిడి, గాండ్లపెంట రైతు సేవాకేంద్రాల్లో బుధవారం యూరియాను పంపిణీ చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసినవరి పంటకు యూరియా వేయాల్సి ఉంది. అయితే యూరియా డిమాండ్ కావడంతో రైతులు నానా ఇబ్బందులుపడ్డారు. అయితే గాండ్లపెంటకు తొమ్మిది టన్నులు, కురమామిడికి 3.6 టన్నుల యూరియా రావడంతో అధికారులు పంపిణీ చేశారు. తహసీల్దార్ బాబురావు, ఏఓ షాదాబ్, ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షు డు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ అకాడమీ వారు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలలో మండల పరిధిలోని నాగలూరు రూపారాజా వీసీఎంఆర్‌పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్టు పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. ప్రతిభ కనబరచిన ఇద్దరు విద్యార్థులు నగదు బహుమతిని, 31 మంది విద్యార్థులు వివిధ పతకాలు సాధించారన్నారు. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ విజేతలకు మెడల్స్ అందజేసి అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు రూపారాజాకృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు
ధర్మవరం విద్యార్థినులు

ధర్మవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ధర్మవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం సుమన, పీడీలు సరళ, స్వరూప పేర్కొన్నారు. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో మంగళవారం జరిగిన స్కూల్‌గేమ్ ఫెడరేషన్ పోటీలలో వారు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అండర్-14 మైనస్ 24కేజీల విభాగంలో సాహిత్య, 26 కేజీల విభాగంలో హారిక, 48కేజీల విభాగంలో ధమరేశ్వరి ఎంపికైనట్లు తెలిపారు. అండర్-17లో 36 కేజీ విభాగంలో టీఎస్ సీమకౌసర్, 46కేజీ విభాగంలో వైష్ణవి, అండర్-19 45కేజీల విభాగంలో అఖిలబాను ప్రతిభ కనబరిచారన్నారు. అలాగే రుక్సానా, సుస్మిత, ప్రణీత, విష్ణు ప్రతిభ కనబరచి ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆ విద్యార్థినులను హెచ్‌ఎం, పీడీలతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు మాధవరెడ్డి,నారాయణస్వామి, కరాటే కోచ్‌లు ఇనాయత్‌బాషా, నవ్యశ్రీ అభినందించారు.

కుడో పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కదిరి అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుడో పోటీల్లో కదిరి మండలంలోని కె. బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శకంర్‌బాబు తెలిపారు. ఈ నెల 13న అనకాపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుడో పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు యాసిన్‌ఖాన్, ఏలేషా గోల్డు మెడల్స్, వేణుకుమార్, సులాం, అక్మల్‌ఖాన్ సిల్వర్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. బుధవారం పాఠశాలలో ఆ విద్యార్థులకు మెడల్స్ అందించి అభినందించారు. పీడీ రాజు, పాఠశాల కమిటీ చైర్మన్ లలితమ్మ, టీడీపీ నాయకులు మనోహర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: అనకాపల్లిలో నిర్వహించిన కుడో రాష్ట్ర సాయి పోటీల్లో మండలంలోని తంగేడుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు జయం రాజేష్ పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థినులు జస్విత, లోమిత, బంగారు పతకాలు, మహిత, హేమశ్రీ వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. వీరు త్వరలో పంజాబ్‌లోని సూరత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆ విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, తిరుపాల్‌నాయక్, మనోహర్, చంద్రకళ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తనకల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈతోడు గ్రామానికి చెందిన హరి కుమార్ అనే వ్యక్తి బుధవారం సాయంత్రం విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపు రం తరలించారు. కాగా అతడు కొంతకాలంగా మూర్ఛవ్యాధి, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని బంధువులు. ఈ కారణంగానే ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు.





డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తున్న ఆపరేటర్



పురుగు మందు డ్రోన్‌లో పోస్తున్న రైతు

డ్రోన్ ఇజం..!

వ్యవసాయంలో సాంకేతిక విప్లవం.. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ

వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అధునాతన వ్యవసాయ పరికరాలు, యంత్రాలు అందజేస్తోంది. ఈక్రమంలోనే పురుగు మందులు పిచికారీ చేయడానికి సబ్సిడీపై డ్రోన్‌లు అందజేసింది. వీటి ద్వారా రైతులు తక్కువ సమయంలో ఎక్కువ పంటకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఒక్క కిసాన్ డ్రోన్ యూనిట్ పూర్తి ధర రూ. 9.8 లక్షలు కాగా రైతు వాటా రూ. 1.96 లక్షలు చెల్లిస్తే మిగిలిన రూ. 7.84 లక్షలు ప్రభుత్వమే భరిస్తుంది. డ్రోన్ ట్యాంకు 12 లీటర్ల నీటి సామర్థ్యం కలిగి ఉంటుంది. విద్యుత్ చార్జింగ్ ద్వారా డ్రోన్ పని చేస్తుంది 40 నుంచి 60 నిమిషాల లోపు డ్రోన్ చార్జింగ్ ఫుల్ అవుతుంది.

- ఆంధ్రజ్యోతి, రాప్తాడు

ఎకరాకు రూ. 500

ఎకరా పొలానికి మందు పిచికారీ చేసినందుకు ఒక ట్యాంకు నీరు (12 లీటర్ల నీరు, పురుగు మందు) అవసరం. ఎకరాకు పురుగు మందు పిచికారీ చేసినందుకు రైతుల నుంచి రూ. 500 తీసుకుంటున్నారు. కిసాన్ డ్రోన్ ట్యాంకు 12 లీటర్ల నీటి సామర్థ్యం కలిగి ఉంటుంది. 12 లీటర్ల నీటిలో పురుగు మందు కలిసి ఒక ఎకరా వరికి 5 నిమిషాల్లోనే మందు పిచికారీ చేయవచ్చు. కిసాన్ డ్రోన్ ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశం తీసుకెళ్లేందుకు ప్రత్యేక స్టాండ్ అమర్చిన ద్విచక్రవాహనం లేదా ఆటో ఉపయోగిస్తున్నారు.

డ్రోన్ ఆపరేటర్‌గా ఉపాధి

రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలోని అన్నదాత రైతు సేవా సంఘంలోని ఐదుగురు సభ్యులు కలిసి కిసాన్ డ్రోన్ తీసుకున్నారు. రెండు నెలల కిందట రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఏఓ కృష్ణ చైతన్య కిసాన్ డ్రోన్‌ను అన్నదాత రైతు సేవా సంఘం సభ్యులకు అందచేశారు. సంఘం సభ్యులు కిసాన్ డ్రోన్ ఆపరేటర్, కో ఆపరేటర్‌ను నియమించి రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని దానిమ్మ, అరటి, చీనీ, వరి, వేరుశనగ, మామిడి వంటి అనేక రకాల పంటలకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ట్రాక్టర్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు కంటే కిసాన్ డ్రోన్ ద్వారా వేగంగా, సులభంగా మందులు పిచికారీ చేయవచ్చు. చదువుకుని ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న యువకులు డ్రోన్ ఆపరేటర్‌గా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

5 నిమిషాల్లోనే ఎకరా పొలానికి..

- రైతులకు వరంగా మారిన కిసాన్ డ్రోన్
- భారీ సబ్సిడీతో పంపిణీ చేస్తున్న ప్రభుత్వం

వేగంగా, సులభంగా..

ఈ ఏడాది రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. ప్రతిఏటా వరికి తైవాన్ స్ప్రేయర్ ద్వారా మందు పిచికారీ చేయాలంటే చాలా కష్టంగా ఉండేది. మోకాలు లోతు బురద మడిలో నడిచి మందు పిచికారీ చేయాలంటే కూలీలు రారు. ఈ ఏడాది కిసాన్ డ్రోన్ అందుబాటులో ఉండటంతో రెండు ఎకరాలకు రెండు ట్యాంకులు మందు పిచికారి చేయించా. పది నిమిషాల్లో పని పూర్తయింది. డ్రోన్ వలన వేగంగా, సులభంగా పూర్తయింది. రెండు ట్యాంకులు మందు పిచికారి చేసినందుకు రూ. వెయ్యి చెల్లించా.



- హరినాథ్‌రెడ్డి, రైతు, ఎం. చెర్లోపల్లి

మండలానికి ఒకటి

పురుగు మందులు సులభంగా, వేగంగా తక్కువ ఖర్చుతో పిచికారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అధిక శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్ అందజేస్తోంది. ప్రస్తుతానికి మండలానికి ఒకటి చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తోంది. అన్ని రకాల పంటలకు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయవచ్చు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

- కృష్ణ చైతన్య, ఏఓ, రాప్తాడు

అగ్రికల్చర్ డిప్లొమా చేశా



హంపాపురం ఆదరణ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్ పూర్తి చేశా. ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నా. గుంటూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 10 రోజులు శిక్షణ తీసుకుని ప్రభుత్వ సర్టిఫికెట్ పొందా. ప్రస్తుతం డ్రోన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నా, ఇప్పటి వరకూ 100 ట్యాంకులకు పైగా మందు పిచికారీ చేశా. సంఘం సభ్యులు నాకు నెలకు రూ.15వేలు, సహాయకుడికి రూ.10వేలు జీతం చెల్లిస్తున్నారు.

- వినయ్‌కుమార్ డ్రోన్ ఆపరేటర్, హంపాపురం

నేడే అమరావతికి పయనం

డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల కోసం 45 బస్సుల ఏర్పాటు



ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఈఓ, ఇతర అధికారులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ- 2025లో ఎంపికైన కొత్త టీచర్లను అమరావతికి తీసుకెళ్తున్నారు. ఏడేళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి టీచర్ల నియామకాలను చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అన్ని జిల్లాలకు చెందిన టీచర్లు, వారికుటుంబ సభ్యులతో 19న రాష్ట్ర ప్రభుత్వం.. అమరావతిలో సమావేశం ఏర్పాటు చేసింది.ఆ మేరకు జిల్లాలో ఎంపికైన 755 మంది కొత్త టీచర్లు, వారి తరఫున ఒక్కో కుటుంబ సభ్యుడిని అమరావతికి తీసుకెళ్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. జోన్-4 స్థాయిలో జిల్లాకు చెందిన అభ్యర్థులు పీజీటీ, టీజీటీలుగా ఎంపికైన వారితోపాటు కుటుంబ సభ్యులను ఇక్కడి నుంచే అమరావతికి తరలిస్తున్నారు. అందు కోసం 45 బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతిబస్సు పర్యవేక్షణకు నలుగురు లైజనింగ్ అధికారులను నియమించారు. వారికి పర్యవేక్షణపై జిల్లా సైన్స్ సెంటర్‌లో సమావేశం ఏర్పాటుచేసి నిబంధనలను తెలియజేశారు. ప్రత్యేక ఐడీ కార్డులు ఇవ్వనున్నారు. గురువారం ఉదయం 6 గంటలకే పీవీకేకే కాలేజ్‌లో బస్సులు సిద్ధంగా ఉంటాయనీ, అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులతో అక్కడకు చేరుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. అనంతపురం, కర్నూలు మీదుగా ఆత్మకూరు, డోర్నాల, వినుకొండ, నరసరావుపేట, గుంటూరుకు బస్సులు చేరుకుంటాయని డీఈఓ వివరించారు.

సీఎస్ సమీక్ష

మెగా డీఎస్సీ-2025లో ఉద్యోగాలను సాధించినవారిని రాజధానికి పంపేందుకు జిల్లా నుంచి 45 బస్సులు ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఏపీ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, విద్యాశాఖ అధికారులు మొత్తం 2100 మంది వరకు అమరావతికి వస్తారని తెలిపారు. బస్సులు గురువారం ఉదయం బయలుదేరి, సాయంత్రానికి అమరావతికి చేరుకుంటాయని వివరించారు. వీసీలో డీఈఓ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

అవధుల్లేని ఆనందం

టీచర్, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన ఎస్కేయూ విద్యార్థులు

బీఎడ్ కళాశాలలో సంబరాలు



ఉద్యోగాలు సాధించినవారితో వీసీ అనిత, కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్ తదితరులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ సెలక్షన్స్, డీఎస్సీలో ఎస్కేయూ బీఎడ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉద్యోగాలు కొల్లగొట్టారు. ఆరుగురు చొప్పున ఎస్జీ టీచర్, కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారు. మరికొందరు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి కళాశాలలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఉద్యోగాలు సాధించిన వారి ఆనందానికి అవధుల్లేవు. వారిని వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు అభినందించారు. జ్ఞాపికలను అందజేశారు. యూనివర్సిటీకి, కళాశాలకు మంచి పేరు తెచ్చారని హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సోమశేఖర్ మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు ఇంతమంది ఒకేసారి ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల పర్యవేక్షకుడు లక్ష్మణరావు, అధ్యాపకులు రాజేశ్వరి, శివానంద, భాస్కర్, నారాయణ స్వామి, సుధాకర్, సాల్మన్‌రాజ్, అనిత, సంజీవరాయుడు, శకుంతల పాల్గొన్నారు.

కష్టానికి ఫలితం దక్కింది: తలారి సురేష్



ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో 87.95 మార్కులు సాధించా. ఎస్ఏ ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులో జిల్లా మొదటి ర్యాంకు దక్కింది. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించా. ఇక్కడి వాతావరణం, అధ్యాపకుల బోధనలు ఉద్యోగ సాధనకు ఎంతో ఉపయోగపడ్డాయి. కష్టపడి చదివినందుకు మంచి ఫలితం దక్కింది. ఎంతో సంతోషంగా ఉంది.

ఆరింటిలో అర్హత సాధించా: శ్రీనివాసులు



ఐదేళ్లుగా ఉపాధ్యాయ నోటిఫికేషన్ కోసం ఎదురుచూశా. నోటిఫికేషన్ వెలువడిన తరువాత కష్టపడి చదివా. ఇటీవల డీఎస్సీలో ఆరింటిలో అర్హత సాధించా. ఎస్ఏ మ్యాథమ్యాటిక్స్‌లో రాష్ట్రస్థాయి 19వ ర్యాంకు దక్కింది. జిల్లాలో ఐదో ర్యాంకు వచ్చింది. ఎస్ఏ మ్యాథమ్యాటిక్స్‌తోపాటు ఫిజికల్ సైన్స్, టీజీటీలో మ్యాథమ్యాటిక్స్, ఫిజికల్ సైన్స్‌లో ఉద్యోగానికి అర్హత సాధించా. మ్యాథమ్యాటిక్స్‌పై మక్కువ ఉండడంతో ఎంపిక చేసుకున్నా. గతంలో రైల్వేలో ఉద్యోగం వచ్చినా వెళ్లలేదు.

అధ్యాపకుల సూచనలు పనికొచ్చాయి: సాయిక్రిష్ణ నాయుడు



డీఎస్సీలో ఎస్ఏ సోషల్‌తోపాటు టీజీటీ ఉద్యోగావకాశం వచ్చింది. కళాశాలలో చదువుకున్నందుకు సంతోషంగా ఉంది. అధ్యాపకుల బోధనలు బాగున్నాయి. వారి సూచనలు ప్రిపరేషన్‌లో చాలా ఉపయోగపడ్డాయి. ఉద్యోగ సాధనకు సహాయపడ్డాయి. నాతోపాటు చదువుకున్న స్నేహితులకు ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉంది.

అర్చకుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- దేవదాయ శాఖ సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి



మాట్లాడుతున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని దేవదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో అర్చక సమావేశం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు నేతృత్వంలో అర్చకులు తమ సమస్యలను సహాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ధూపదీప నైవేద్య పథకం, ఉపనయనం, డెత్ గ్రాట్యుటీ, 43 రిజిస్ట్రేషన్, అర్చకులకు పంట నష్ట పరిహారం, వాతావరణ బీమా తదితర పథకాలు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే తల్లికి వందనం పథకం అర్చక కుటుంబాలకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. వీటన్నింటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి మాట్లాడుతూ.. అర్చక కుటుంబాలకు సంక్షేమ పథకాల వర్తింపు తమ పరిధిలో ఉండదన్నారు. ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్చకుల సమస్యలను ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా ఈఓలు తమ పరిధిల్లోని ఆలయాల్లో సమస్యలపై దృష్టి సారించేలా సూచనలిస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు సీతారామశర్మ, ప్రసాద్, కందుకూరు రామాంజనేయులు, పలుకూరు రవికుమార్, మారుతీప్రసాద్, వెంకటగిరయ్య, తిరుపతయ్య, చంద్రమౌళి, విజయ్‌కుమార్, రాజన్న, మల్లికార్జున, వేణుగోపాలస్వామి, రమణ, భార్గవ, నందాచార్యులు, నవీన్, చేతన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 480 మార్కులకుపైగా, ప్రైవేటు స్కూళ్లలో 520కిపైగా సాధించినవారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో 850, ప్రైవేటు కాలేజీల్లో 900 మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ప్రతులను ఎం. శ్రీనివాసులు ఆర్టీసీ, డోర్ నం. 18-1-406, వేణుగోపాల్ నగర్, అనంతపురం చిరునామాకు పంపాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు అక్టోబరు 19వ తేదీన జీసెస్‌నగర్‌లోని జయమనెమ్మ కల్యాణమండపంలో పురస్కారాలు అందజేస్తామన్నారు. వివరాలకు 9441222874 నంబరులో సంప్రదించాలన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

అనంతపురంరూరల్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులో గల ఎస్ఎల్ఎస్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 19వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల సీఈఓ వెంకటరామిరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీసీఏ, ఎంబీఏ, ఎంసీఏ కంప్యూటర్స్ 2023, 2024, 2025 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చన్నారు. ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆయా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9440469476 నంబరులో సంప్రదించాలన్నారు.

మీ ఫొటోకు ఓ దండం!

- స్మార్ట్ రైస్ కార్డు పంపిణీలో చోటానాయకుల ఫొటో షూట్
- తలలు పట్టుకుంటున్న రేషన్‌షాపు డీలర్లు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీకి ఫొటో షూట్ ప్రతిబంధకంగా మారుతోంది. అధికారపార్టీకి చెందిన కొందరు చోటా నాయకులు కార్డుల పంపిణీ కార్యక్రమంలో తాముండాలంటూ షో చేస్తుండటమే ఇబ్బందులకు కారణమవు తున్నట్లు సమాచారం. ఈక్రమంలో రేషన్‌కార్డుదారులను ఒక చోట చేర్చడానికి, ఫొటో తీయించడానికే సమయం సరిపోతోందని, ఇక స్మార్ట్‌కార్డులు ఎప్పుడు పంపిణీ చేయాలంటూ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 15నుంచి స్మార్ట్ రైస్ కార్డులను రేషన్‌కార్డుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. తొలి రోజు అశోక్‌నగర్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ కార్డులు పంపిణీ చేశారు. ఆ సమయంలో స్థానిక అధికారపార్టీ నాయకులు పాల్గొన్నారు. అదే రోజు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకుల సమక్షంలో స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. అయితే ప్రతి రోజూ స్థానిక నాయకులు ఫొటో కోసం ఎగబడుతున్నట్లు సమాచారం. ఫొటోషూట్ తతంగం ముగియడానికి రోజుకు 3గంటల సమయం పడుతున్నట్లు సమాచారం. దీంతో రైస్ కార్డుల పంపిణీ సక్రమంగా సాగడం లేదని సమాచారం. జిల్లా కేంద్రం, కొన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో ఈ తరహా షో ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. దీంతో డీలర్లు..'బాబు ఒక రోజైతే పర్లేదు ప్రతి రోజూ ఇలాగే చేస్తూ పోతే కార్డులు పంపిణీ చేయలేం...మీకో దండం..మీ ఫొటోకో దండం' అంటున్నారు. వాస్తవానికి ఈనెల 6నే రైస్ కార్డులను పంపిణీ చేయాల్సింది. కానీ ఆలస్యం చేసి 15నుంచి పంపిణీ చేస్తున్నారు.

హక్కుల సాధనే ఐద్వా ధ్యేయం

సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ప్రసూన

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల సాధనే ఐద్వా ధ్యేయమని సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ప్రసూన అన్నారు. అనంతపురం వేదికగా అక్టోబరు 13, 14, 15 తేదీల్లో నిర్వహించే ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను పురస్కరించుకుని నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. 1936లో కృష్ణా జిల్లాలో ఆంధ్ర మహిళా సంఘంగా ఏర్పడి, 1981లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘంగా(ఐద్వా) రూపాంతరం చెందిందని తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారానికి ఐద్వా ఆవిర్భావం నుంచి కృషి చేస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా రెండు కోట్ల మంది సభ్యులున్న ఐద్వా, మహిళల రక్షణ కోసం పోరాటాల ద్వారా అనేక చట్టాలను సాధించిందని అన్నారు. ఆస్తి హక్కు, వరకట్న వేధింపుల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ, గృహహింస వంటి అనేక చట్టాలను సాధించుకోవడానికి ఐద్వా తోడ్పడిందని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ సాధన కోసం అలుపెరుగని పోరాటం చేశామని అన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు, ఆర్థిక వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా ఐద్వా పోరాడుతోందని అన్నారు. అనంతపురంలో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో మహిళలు, విద్యార్థినులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల నేపథ్యంలో అక్టోబరు 9, 10, 11వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని కృష్ణ కళా మందిర్‌లో ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ విశ్వనాథ రెడ్డి, డాక్టర్ పల్లవి, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల కార్యదర్శి నిర్మలమ్మ, ప్రిన్సిపాల్ సరిత, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ మాధవి, ఐద్వా జిల్లా నాయకురాలు గీత, నగర కార్యదర్శి అశ్విని పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రసూన

తొలి వాస్తుశిల్పి విశ్వకర్మ

జయంతి వేడుకలలో ఎంపీ అంబికా



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వంలోనే తొలి వాస్తు శిల్పి విశ్వకర్మ అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి శంఖం ఊది ప్రారంభించారు. అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో సీనియర్ న్యాయవాది గురుప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ శివనారాయణశర్మ, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత విశ్వకర్మ చిత్రపటానికి పూలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జేసీ మాట్లాడుతూ విశ్వకర్మను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. చేతి, కులవృత్తుల వారు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ హిందూ సంస్కృతిలో విశ్వకర్మకు ప్రముఖమైన స్థానం ఉందని తెలిపారు. వేడుకల్లో భాగంగా బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులు సంప్రదాయ నృత్యరూపకాలతో అలరించారు. ప్రదర్శనానంతరం విద్యార్థులను ముఖ్యఅతిథులు జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి, డీఆర్ఓ మలోల, ఆలయ చైర్మన్ మౌళి ఆచారి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ సుభాషిని, డీపీఆర్ఓ బాలకొండయ్య, అర్బన్ తహసీల్దార్ హరిప్రసాద్, పరిశ్రమలశాఖ జీఎం శ్రీనివాస్‌యాదవ్, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

వసతుల కల్పనకు ప్రాధాన్యం

- సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ



వివరాలు వెల్లడిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురంవిద్య, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ పేర్కొన్నారు. సమగ్రశిక్ష ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి బుధవారం ఆమె విలేకరులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న ప్రతివిద్యార్థికి ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, యూనిఫామ్, బూట్లు, నోటు బుక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 36,66,533 విద్యా కిట్లను అందజేసినట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో రూ.53కోట్లతో వివిధ రకాల సివిల్ పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాఠశాలలు, ఎమ్మార్సీలు, కాంప్లెక్స్‌లకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. విద్యా ప్రమాణాలు పెంపునకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేజీబీవీల్లో పాల్ కార్యక్రమం ద్వారా పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చి అందులో ఏఐ ద్వారా బోధన చేయిస్తున్నట్లు తెలిపారు. విద్యాశక్తి, విద్యాపథం కార్యక్రమాలు నిర్వహిస్తూ స్పెషల్‌క్లాస్‌లు ఏర్పాటు చేసి, రోజుకొక సబ్జెక్టుకు టెస్టులు పెడుతున్నామన్నారు. పాల్‌కార్యక్రమం అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలోను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీఎంశ్రీ స్కూల్స్ జిల్లాలో 42ఉండగా కొత్తగా ఉరవకొండ ఏఆర్ఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్, గుత్తిఏపీమోడల్‌స్కూల్స్‌కు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్ఏ ద్వారా అన్నిపాఠశాలలోను ఒకేషనల్ కోర్సులు ఏర్పాటు చేసి ప్రత్యేక టీచర్లను నియమించి పిల్లలకు నేర్పిస్తామన్నారు. అనంతజిల్లాలోని కేజీబీవీలను ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శంగా నిలపడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని ఏపీసీ శైలజ తెలిపారు.

నేడు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

కొత్తచెరువు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఉదయం 11గంటల నుంచి గూగుల్ మీట్ ద్వారా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9492843184 నంబరులో సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా జ్యోతుల ఉత్సవం


జ్యోతులతో వస్తున్న మహిళలు

మడకశిర రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌడనహళ్లిలో వెలసిన నరసింహస్వామి ఆలయంలో జ్యోతుల ఉత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. గౌడనహళ్లి, ఆమిదాలగొంది పంచాయతీల్లోని ఏడు గ్రామాల ప్రజలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి స్వామి వారి ఆలయం చూట్టు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు.

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు

అమరాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో బుధవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ రామారావు అధ్యక్షతన వేడుకలను జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ విశ్వకర్మ అంటే హిందూ పురాణాల్లో సృష్టికర్త, దేవతల వాస్తుశిల్పి, ఆయనను దేశశిల్ప దైవక సృష్టికర్తగా కొలుస్తారన్నారు. కార్యక్రమంలో మారుతిప్రకాశ్, యూనుస్‌ఖాన్, ఆర్ఐ విన్సెంట్‌పాల్, ఉపాధిహామీ ఏపీఓ శివన్న, మండల పరిషత్ పరిపాలన అధికారి ఆరాధ్య పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో కోచ్

హిందూపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఆర్డీటీ ఇండోర్ స్టేడియంలో పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల క్రీడల్లో హిందూపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటిస్థానంలో రియాజ్, సయ్యద్, శోభన్, నేహ, గ్రిష్మిత, మమత, ధనుంజయ, యాహియ, అబ్దుల్లా, దీక్షిత్, సాహిల్, చరణ్ నిలిచారు. ద్వితీయ స్థానంలో యాసిన్‌తాజ్, తహసీన, జాన్‌విక్టర్, షాజిద్‌ఖాన్, హితేజ్‌దత్త, అభిలాష్, వరాహ, శివశంకర్, తిరుమలేష్, మూడో స్థానంలో మరికొంతమంది నిలిచారు.

నవీన్ కుటుంబానికి పరామర్శ

చిలమత్తూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అవయవాలను దానం చేసి మృతిచెందిన నవీన్ కుటుంబాన్ని టీడీపీ హిందూపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ శ్రీనివాసులు పరామర్శించారు. నవీన్ మృతదేహం స్వస్థలమైన తుమ్మలకుంటకు చేరుకోగానే వారు అక్కడికి వెళ్లి మృతదేహం వద్ద నివాళి అర్పించారు. అనంతరం నవీన్ తల్లి గీతమ్మను ఓదార్చారు. ఒక్కగానొక్క కొడుకుని పోగొట్టుకొని దుఖంలో ఉన్నా గొప్ప మనసుతో నవీన్ అవయవాలను దానం చేయడానికి అంగీకారం తెలపడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే పీఏ బాలాజీ, లక్ష్మీనారాయణయాదవ్, గౌరీశంకర్, విశ్వనాథరెడ్డి, నందీషప్ప, అశ్వత్థప్ప పాల్గొన్నారు.

8.06 సెం.మీ. వర్షపాతం నమోదు

మడకశిర టౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం రాత్రి 8.06 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పది రోజులుగా వర్షం కురవక పోవడం ఎండలు ఎక్కువ కావడంతో రైతులు పెట్టిన వేరుశనగ, ఇతర పంటలు ఎండుముఖం పట్టాయి. మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురవడంతో ఎండుతున్న పంటలకు జీవం పోసినట్లు అయిందని రైతన్నలు అంటున్నారు. పంటలు పచ్చదనం సంతరించుకుంటూ ఉండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మడకశరలో 2.68 సెం.మీ., రొళ్ళ 1.82, అమరాపురం 0.3, గుండిబండ 0.34, అగళి 0.29 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ప్రేమ వివాహం జరిపించిన టీడీపీ నాయకులు

రొద్దం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లూరు దళితవాడకు చెందిన ముద్దగంగ, మంజునాథ్‌లు ప్రేమించుకోగా తల్లిదండ్రులు నిరాకరించడంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇటీవల రొద్దం మండలం నల్లూరు గ్రామానికి చెందిన పార్వతమ్మ, గంగయ్య కుమార్తె ముద్దగంగ, లక్ష్మీ, నాగరాజుల కుమారుడు మంజునాథ్ ప్రేమించుకోగా గొడవ జరిగింది. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. టీడీపీ నాయకులు ఇరుకుటుంబాల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రేమజంటను ఒక్కటి చేశారు. బుధవారం రుద్రపాదాశ్రమం వద్ద హిందూ ధర్మశాస్త్రం ప్రకారం పెళ్లి చేశారు. మాధవనాయుడు, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, చంద్రమౌళి, నరహరి, నరసింహులు, మారెప్ప, గోపాల్, చంద్రశేఖర్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడిపై కేసు నమోదు

హిందూపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాపూజీనగర్‌కు చెందిన వైసీపీ మాజీ పట్టణాధ్యక్షుడు సీఎస్‌పీ నాగరాజుపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. మంగళవారం మోతుకపల్లి సమీపంలో టీడీపీ నాయకుడు యుగంధర్(చింటు)పై దాడికి ఆయన యత్నించాడు. బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి బుధవారం నాగరాజును అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిమేకలపల్లికి చెందిన 25 ఏళ్ల మహిళ బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. భార్యాభర్తల మధ్య నెలకున్న విభేదాల కారణంగా ఆమె చేతి గాజులను నూరి తాగి ఆత్మహత్యకు యత్నించింది. గుర్తించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ ఉషా చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం హిందూపురం వెళ్లాలని సూచించారు.

కుక్కలున్నాయ్ జాగ్రత్త..!

- పురంలో ఎటు చూసినా వీధికుక్కలే..
- పశువులతో ప్రజల పాట్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో గుంపుగా ఉన్న వీధికుక్కలు

హిందూపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణంలో ఎటు చూసిన గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏస్థాయిలో ఉన్నాయో చెప్పడానికి పై చిత్రమే నిదర్శనం. ఒకటో రెండో కాదు పదుల సంఖ్యలో ఒకే చోట చేరుతున్నాయి. ఆ సమయంలో అటుగా వెళ్లే పాదచారులు లేదా ద్విచక్రవాహన చోదకుల వెంటపడి దాడిచేస్తున్నాయి. వీటి నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదాలుకూడా జరుగుతున్నాయి. వీధులవెంట నడుచుకుని వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. సాయంత్రం 6 దాటితే రోడ్డుపై రావడానికే భయపడే పరిస్థితి దాపురించింది. ఇక మాంసం దుకాణాలు, డాబాలు, హోటళ్లవద్ద గుంపులు గుంపులుగా తిరుగుతుంటాయి. దీనివల్ల రోడ్డుపైకెక్కాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వీటిని నియంత్రించాలంటూ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గుంపులుగా పశువులు

పట్టణంలో రాత్రింపగళ్లు పశువులు రోడ్డుపై గుంపులు గుంపులుగా తిరుగుతుంటాయి. దీనివల్ల పలుసార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. ఇటీవల పెనుకొండ రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని కిందకు తోసేయగా తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా రోడ్డుపక్కన నడుచుకుని వెళ్తున్న వ్యక్తిని కొమ్ములతో పొడవగా ఆసుపత్రిపాలయ్యాడు. పలువురు వీటిని తప్పించే క్రమంలో కిందపడి గాయపడిన సంఘటనలు కోకొల్లలు. పశువులను రోడ్డుపైకి వదలడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


రోడ్డుపై అడ్డంగా ఉన్న పశువులు గుంపు

పురాన్ని సుందరంగా ఉంచడమే లక్ష్యం

హిందూపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రెండో మోడల్ కాలనీ ప్రాంతంలో ఆయన పర్యటించారు. కాలనీలో 30ఏళ్ల క్రితమే సీసీరోడ్లు ఏర్పాటు చేశామని, అందుకు తగ్గట్టు కాలువలు వెడల్పు చేయాలని నిర్ణయించామన్నారు. తిలక్‌నగర్‌కు వెళ్లే రహదారి పక్కన ఉన్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, మురళి, అరుణ, రామాంజనేయులు, అయూబ్, దస్తగిరి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయిస్తాం: చైర్మన్

మడకశిర టౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని గృహం లేని ప్రతి పేదవారికి పీఎంఏవై కింద మంజూరు చేయిస్తామని చైర్మన్ నరసింహరాజు అన్నారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో పీఎంఏవై కింద బుధవారం నుంచి 27వ తేదీ వరకు పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్లడ్ డొనేట్ క్యాంప్ ఏర్పాటు, స్కిల్ డెవలప్‌మెంట్, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన, యోగా, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరు ఇందులో పాల్గొనాలని కోరారు. కమిషనర్ జగన్నాథ్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలాజీ జన్మదిన వేడుకలు


కేక్‌కట్‌చేస్తున్న బండారు బాలాజీ

హిందూపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్‌బీకే ఫ్యాన్స్ టౌన్‌వైడ్ ప్రెసిడెంట్ బండారు బాలాజీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముద్దిరెడ్డిపల్లిలోని తన నివాసం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేక్ కట్‌చేశారు. టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, మున్సిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, బాలాజీ, నాగరాజు, బేవనహళ్లి ఆనంద్, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్, మంగేష్, నంబూరి సతీష్, రాయల్‌గోపాల్, హెచ్‌ఎన్ రాము, మంచాల మారుతి, ఏసీ నాగరాజు, కోరుముట్ల నాగేంద్ర, శంకర్, నారాయణస్వామి, ఆది, నాగరాజు పాల్గొన్నారు.

దసరా వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

లేపాక్షి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని దుర్గా వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ అన్నారు. ఉత్సవాలు 22నుంచి 11రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం ఆలయంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు దేవదాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 11రోజులపాటు ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో దుర్గామాతను రోజుకో అలంకరణ చేస్తారన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, ఈఓ నరసింహమూర్తి, టీడీపీ మండల కన్వీనర్ అబి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వాహన మిత్రకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

అగళి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం నుంచి మూడు రోజులపాటు వాహన మిత్ర పథకానికి సంబంధించి ఆటో డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానికుడై ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో పేరు ఉండాలని ఆర్సీ, ఫిట్నెస్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుకు ఆర్‌సీ అనుసంధానమై ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫామ్‌ను గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అందజేయాలన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

రొళ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరం బొల్లారంలో స్కూల్ స్పోర్ట్స్ అండర్ కల్చరల్ యాక్టివిటీష్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటారు. 9వ తరగతి విద్యార్థులు ఆంధ్ర జట్టులో 15 మందిలో 9మంది పాల్గొని టోర్నమెంట్ విన్నర్‌గా నిలిచారు. ఫైనల్‌మ్యాచ్‌లో తెలంగాణ జట్టుతో తలపడి ఆంధ్రజట్టు నిర్ణీత 20ఓవర్లలో 113పరుగులు చేసింది. 114పరుగులు టార్గెట్‌తో బరిలోదిగిన తెలంగాణ జట్టు 110పరుగులు మాత్రమే చేయగలిగింది. గెలుపొందిన క్రీడాకారులను ఎంఈఓ శ్రీధర్, ప్రిన్సిపాల్ మైలారప్ప, ఎస్ఎంసీ చైర్మన్ సుమజగన్నాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

సచివాలయాల తనిఖీ

సోమందేపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి, తుంగోడు, గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ నర్సింగరావు తనిఖీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న స్వచ్ఛతాహీసేవ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సిబ్బంది ఆయా గ్రామాల్లో పరిసరాల శుభ్రతపై చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తుంగోడులో చెత్తతో సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ మండల కోఆర్డినేటర్ జగదీశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణంలో..

పరిగి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ దుకాణంలో అధిక ధరలకు సరుకులను అమ్ముతున్నారంటూ ఫిర్యాదు రావడంతో పౌరసరఫరాలశాఖ అధికారి సావిత్రమ్మ బుధవారం దుకాణం వద్దకు చేరుకుని విక్రయిస్తున్న ధరలను పరిశీలించారు. దీనిపై పూర్తిగా పర్యవేక్షించిన తరువాత నోటీసులు అందజేస్తామని ఆమె తెలిపారు. ఆర్ఐ సిద్దేశ్ పాల్గొన్నారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండండి: ఎస్ఐ

సోమందేపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండటంతో ఆయా కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ సూచించారు. ప్రార్థనా మందిరాల్లో వాచ్‌మెన్, సెక్యూరిటీగార్డ్, పారా వలంటీర్లను నియమించుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విలువైన ఆభరణాలు భక్తులు సమర్పించే కానుకలు, హుండీలో వేసే నగదును కమిటీవారు తమవద్దే ఉంచుకోవాలని, లేనిపక్షంలో బ్యాంకుల్లో పెట్టుకోవాలన్నారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మార్కెట్‌లోకి కొత్త హోండా ద్విచక్రవాహనం


ప్రీమియం హోండా షోరూమ్‌లో కేక్‌కట్‌చేస్తున్న షోరూం యజమాని

హిందూపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రీమియం హోండా షోరూమ్‌లో ఆధునిక స్థాయిలో నిత్యనూతనంగా యువతరం కోసం సీబీ హార్నెట్ 125, షైన్ 100 డీఎక్స్ వాహనాలు మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూమ్‌లో కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంచారు. షోరూమ్ యజమాని ప్రసాద్‌రెడ్డి, కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ ప్రజ్వల్ మాట్లాడుతూ జీఎస్‌టీ తగ్గింపు ధరలతో వాహనాలు కొనుగోలు చేయవచ్చన్నారు. నారాయణరెడ్డి, రాంప్రసాద్, మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రఫీక్, రహ్మతుల్లా, బసవరాజు, సబ్‌డీలర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుదాం: యూటీఎఫ్


సోమందేపల్లిలో రణభేరి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సోమందేపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాల, ఉపాధ్యాయ సమస్యలపై కలిసి సాధించుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు జయచంద్రారెడ్డి, సురేష్‌కుమార్, లక్ష్మీరాజు అన్నారు. రణభేరి కార్యక్రమంలో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వారు ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలతోపాటు ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న ప్రధాన సమస్యల సాధనకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. సుధాకర్, బూతన్న, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. పెనుకొండలో ప్రారంభమైన బైక్ ర్యాలీ గోరంట్ల ప్రధాన రహదారిపై వెళ్తూ ఎమ్మార్సీ వద్ద సమావేశమయ్యారు. విద్యారంగ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర నాయకులు జయచంద్రారెడ్డి, లక్ష్మీరాజా, సురేష్, సుధాకర్, క్రిష్టప్ప, మురళీ, క్రిష్ణమూర్తి, చాంద్‌బాషా, నగేష్, శ్రీధర్‌రావు, రామక్రిష్ణ, ఆంజనేయులు, వెంకటేష్, విజయ్, కేశప్ప పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి భరోసా

స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో నాయకులు, అధికారులు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో మహిళ బాగుంటే ఆ కుటుంబమంతా బాగుంటుందన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళా ఆరోగ్య పరిరక్షణ కోసం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం తీసుకొచ్చిందని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చైర్మన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై కుటుంబ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ఆర్ఎంఓ లక్ష్మీరామానాయక్, చంద్రకళ, ఓబులమ్మ పాల్గొన్నారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం అధికారులు, నాయకులు ప్రారంభించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు ఆరు థీమ్‌లపై కార్యక్రమం ఉంటుందని సీడీపీఓ శాంతలక్ష్మి తెలిపారు. సర్పంచ్ గంగాదేవి, ఎంపీపీ గంగమ్మ, కన్వీనర్ వెంకటేశులు, వైద్యులు ఆయిశా, ఓంకార్, ఆయుష్ వైద్యులు అశ్వినికుమార్, పర్యవేక్షకులు రవీంద్ర, రత్నమ్మ, శోభారాణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆరోగ్యంగా ఉంచే విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పనిచేస్తున్నాయని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లావణ్య అధ్యక్షతన బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, చంద్ర ఉన్నారు.

అగళి(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డా.శివానంద తెలిపారు. స్వస్థ్ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం నుంచి అక్టోబరు 2వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు వైద్యశిబిరం నిర్వహించామన్నారు. జడ్పీటీసీ ఉమేష్, వైద్యులు శివానంద, చిదానంద, కన్వీనర్ తిప్పేస్వామి పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైద్యాధికారి నాగరాజునాయక్ అన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళా ఆరోగ్య పరిరక్షణ కోసం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయని అన్నారు. డాక్టర్ శ్రావణి, సీడీపీఓ ధనలక్ష్మి, హెచ్ఎం నాగార్జునుడు పాల్గొన్నారు.

గోరంట్ల: కూటమి ప్రభుత్వం మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చి దిద్దేందుకు స్వస్థ్ నారీసశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని వైద్యులు తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో డాక్టర్ ఆఫ్తాబ్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు అవగాహన కల్పించారు. వైద్యులు వినోద్‌కుమార్, ఉషా, తేజశ్విని, వేణుగోపాల్, కూటమి నాయకులు బాలక్రిష్ణ చౌదరి, లక్ష్మీనానారాయణ, సంతోష్, సోముశేఖర్, నిమ్మల విద్యాధరణి, అశ్వత్థరెడ్డి, రఘు పాల్గొన్నారు.

పట్టు రైతుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మడకశిర టౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో పట్టురైతులు ఎదుర్కొంటున్న రీలర్ల సమస్యను సభ దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రధానంగా హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువుకు నీరు, బైపాస్ కెనాల్ ఏర్పాటు, ఆర్టీసీ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్, నగర పంచాయతీ పరిధిలో డ్రైనేజీ, తాగునీటి సమస్యపై ప్రధానంగా చర్చిస్తానన్నారు. ముఖ్యమంత్రి మడకశిర పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీలు సంబంధించి ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

అధికారులులేని సర్వసభ్య సమావేశం ఎందుకు?

గుడిబండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ రాధమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ కేశవరెడ్డి నిర్వహించారు. విద్యుత్‌శాఖ, వైద్య ఆరోగ్య, ఇరిగేషన్, ఆర్టీసీ, సెరికల్చర్, ఏపీఎంఐపీ, హార్టికల్చర్ తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప మాట్లాడుతూ మండలస్థాయి అధికారులు సమావేశానికి రాకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులోలేని విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ భూతరాజు, ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్, వెలుగు సీసీ నాగరాజు, ఏపీఓ జగదీశ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


రక్తదానం చేస్తున్న పరిగి వేణుగోపాల్

పరిగి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత దేశం కొన్నేళ్ల క్రితం ఆర్థికంగా వెనుకబడి ఉండేదని, మోదీ రాకతో దేశాల్లో మూడో అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశం నిలిచిందన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా దేశ వ్యాప్తంగా స్వస్థ్‌నారీ శక్తిఅభియాన్ ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని మహిళలకు ఇంటింటికి వెళ్లి చికిత్సలు నిర్వహించి క్యాన్సర్, అధికరక్తపోటు, టీకాలు, తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, తహసీల్దార్ హసీనాసుల్తానా, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఆర్ఐ సిద్దేశ్, ప్రవీణ్‌రెడ్డి, మూర్తి పాల్గొన్నారు.



రొద్దం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. బుధవారం రొద్దం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకల సందర్భంగా బీజేపీ నాయకులు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. టీడీపీ సుబ్బరత్నమ్మ, నారప్ప, వైద్యాధికారి సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు వేణుగోపాల్, పవన్, రవి, తిప్పేస్వామి, లింగమయ్య, మహదేవ్, గంగాధరప్ప, మోహన్, రాజు, చిక్కప్ప, సురేష్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ గుప్త ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచుకొన్నారు. కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, పురుషోత్తం పాల్గొన్నారు.



పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశానికి అందిస్తున్న సేవలు అమోఘమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అన్నారు. ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఎనుమల రామక్రిష్ణ, గోపీనాథ్, మమత పాల్గొన్నారు.



రొళ్ల(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బుధవారం బీజేపీ, కూటమి నాయకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ మండల కన్వీనర్ బద్రీనాథ్ ఆధ్వర్యంలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. డాక్టర్ సృజన, షోయబ్, సుజిత, రామదాసరావు, గురుమూర్తి, జయరాంగౌడ్ పాల్గొన్నారు.

పార్టీకి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించం

● వాల్మీకి సంఘం అధ్యక్షుడు రామచంద్ర

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ పేరుచెప్పుకుని పార్టీకి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించేది లేదని మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర వాల్మీకి అధ్యక్షుడు పొగాకు రామచంద్ర అన్నారు. రెండ్రోజుల క్రితం అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన యువతిపై మునిమడుగు వైస్ సర్పంచ్ వెంకటరెడ్డి అసభ్యకరంగా ప్రవర్తించాడన్నారు. మహిళలపట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే పార్టీనుంచి బహిష్కరిస్తామన్నారు. మండల కన్వీనర్ నరసింహ పాల్గొన్నారు.